Reg. No. M. [illegible]52.

# జమీన్ రైతు

"ZAMIN RYOT"

A Telugu Weekly Voice of Ryots & Zamin Ryots

ప్రతి శుక్రవారము ప్రకటింపబడును

సంపుటం 4 సంచిక 18 | నెల్లూరు - 12-7-35 - శుక్రవారము | సం॥ చందా 4-0-0.

## భారతీయులకుగల ఆయుధము ఒక్కటే!!

### విదేశములలో తీవ్ర ప్రచారము.

(ప్రత్యేక విలేఖరి)

ఇండియాను గుఱించి పాశ్చాత్య దేశములందు విరివిగా ప్రచారము జరుగుచున్నది. భారతీయులు అనాగరకులనియు, మృగప్రాయులనియు, మొరటు జాతులనియు, స్వాతంత్ర్యమునకు అనర్హులనియు, పరిపరి విధములుగ చాటబడుచున్నది. బ్రిటిషు సామ్రాజ్యమున కంటగట్టబడక పోయినచో, ఇండియా అథోగతి పాలగునని దేశదేశములలో తీవ్రముగా ఆందోళనము చేయుచున్నారు. అమెరికా ఖండములో బ్రిటిషు దొరతనమువారింతకు విరివిగా ఖర్చుపెట్టుచున్నారు. అనధికార సంఘములు వేనకువేలు ఇందుకుగా వెచ్చించుచున్నారు. అమెరికా కేంద్రముయినది. జర్మనీ నలువంకలను ఈ ఘోష ప్రతిధ్వనించుచున్నది. ఇటలీలోను, ఫ్రాన్సునందును, నిరంతర ప్రచారము జరుగుచునేయున్నది.

ఒక అమెరికాలో యీలాగున 2000 మంది ప్రచారకులుగలరు. వార్తా పత్రికలయూలమునను, మాటలాడు ఫిలిముల ద్వారాను, ఉపన్యాసములు, బాలుర వాచక పుస్తకములు, రేడియోకథలు, విరివిగా నుపయోగింప బడుచున్నవి. ఎందరోపత్రికాధిపతులకు ఇండియాను దూషించుకొరకు ద్రవ్యము వెచ్చింపబడుచున్నది. సామాన్యముగ అమెరికనులకు భారతీయులయెడ సద్భావముగలదు. ఆ భావమును నాశముచేయుటే యీప్రచారకులపని ఇదియొక పెద్దగాంగ్అని చెప్పవచ్చును. మేయోకన్య, కెండాలీసతి, నిలక్రాంకుక్, హాట్కిన్సు, లెఫ్టినెంటు కర్నల్ హెట్కిన్సన్, సింగపూరు, జేమ్సుమార్టిన్ వీరిలో అగ్రగణ్యులు.

"కాళీతత్వము" "భరతవర్ష సందేశము" "బంగాలీ" మొదలగు ఫిలుములు వీరి ప్రోత్సాహముచేత తయారుకాబడినవి. వీని మూలమున బ్రిటిషు ఆధిపత్యావశ్యకతయును, అధికారవర్గము వారి అత్యాచారములను సమర్థింపబడుచున్నవి.

ఇక ఇండియాలోని యిరోపియనుల విషయమును గమనింతము స్వంతలాభముల కొరకు భారతీయ వ్యాపారము నిర్మూలముచేయుట వారి సంకల్పమైనది సింగపూరులోనుండి యీ ప్రచారము లోకమంతటను ప్రాకుచున్నది. సిల్వరు జుబిలీ "సావినర్ ప్రోగ్రాము" సంపాదకుడు మార్టిన్ దొర భారతీయులు మోసగాండ్రనియును, చికాగో గ్యాంగ్‌స్టర్లకన్న అధములనియు, వారితో వ్యాపారము చేయరాదనియును వ్రాయుటకు సాహసించెను.

ఇవ్విధమగు ప్రచారము శాంతియుతమైనను, భయంకరమును, బలప్రదమైన యుద్ధసన్నాహ మనవలయును. విదేశములలో భారతీయుల పక్షమున ప్రచారము జరుపుటవలన నెక్కువ లాభముండదని బుల్లుభాయిగారు తలచుట పొరపాటు కాంగ్రెసు అధ్యక్షులు రాజేంద్ర ప్రసాదు గారు కూడ ఇదే పొరపాటు బడుచున్నారు. రష్యా విషయమును చూతము. వారిపై గావింపబడిన ప్రచారము వారిని నాశముగావించినది. ప్రతిప్రచారము ద్విగుణీతముగ సాగించుటచేత వారు బలమును పొందగల్గిరి. గడచిన సంగ్రామములో ప్రచారమువలన అమెరికా జర్మనికి వ్యతిరే [illegible] యుద్ధములో జర్మనీకి అపజయముకల్గినది జర్మనీకనుకూలముగనుండిన బెల్జియము యుద్ధకాలములో తిరుగబడుటకు ప్రచారమే కారణము. బోయరుయుద్ధములో బ్రిటను ప్రచారమువలననే లోకముయొక్క సానుభూతి బడయగల్గినది. బాల్కనులు టర్కీ సామ్రాజ్యము విధ్వంసముచేసినదియు, అరేబియాలో కర్నల్ లారెన్సు తిరుగుబాటులు లేవనెత్తినదియు, ఐర్లండు స్వాతంత్ర్యమును, ప్రచారబలము వలననే గల్గినవి. ప్రచారమువంటి బలమైన ఆయుధము యీకాలములోలేదు. మారణయంత్రములుగాని, ధనముగాని, మరేదియు ప్రచారముతో సాటిగాదు.

వ్యాపారస్థునకు ప్రకటనమెంత అవసరమో, దేశాభ్యుదయమునకు ప్రచారమంత అవసరము. భారతీయుల నిజస్థితి అన్యదేశీయులకు తెలుపకున్న భారతజాతి చనిపోయినదని వారు భావింతురు.

ప్రచారమునందు లాభములేకున్న మన విరోధులేల కోట్లపర్యంతము మీ ప్రచారోద్యమమున వెచ్చింతురు? విజితులైన ప్రజల సానుభూతి సహాయములేకున్న సామ్రాజ్యములు నిలువజాలవు ఇందుకు ప్రచారము ముఖ్యరాజ్యాంగములలో నొకటి. తమ విధానమును ఈ ప్రచార మూలమున సమర్థించి, ప్రజలలో నమ్మకము పుట్టింతురు. ప్రచారమున కియ్యకొనకున్న ప్రపంచములో హిందూదేశమునకుగల పరపతి చెడిపోవును. వర్తకస్థలములు విడివడిపోవును.

ఇది ప్రచండము. సులభసాధ్యమైనదిగాదు. మన విరోధులు అవలంబించు విధానమునకన్న మనము రెండంతలుగా చేయవలెను. వార్తాపత్రికలు, ఉపన్యాసములు ఫిలిము ప్రదర్శనములు, వస్తుప్రదర్శనములు, వాఙ్మయప్రచారము మొదలైనవి తనివితీర జరుపవలసియుండును. కీ॥శే॥ విఠల్ భాయిగారి సంకల్పము నెరవేర్చుట భారతీయులకు అత్యవసరమైనది.

రౌండుటేబిలు సమావేశ సమయములందు మహాత్ముడు ఇంగ్లండున కరిగినందుచేత జరిగిన ప్రచారము ఇంతింతనజాలము. సరోజనీదేవిగారు ఆఫ్రికా అమెరికా ఖండములందు సంచారముచేసి ఇండియానట్లు వలసినంత సానుభూతిని బడయగల్గెను.

రానుండు కాలము మరీ విషమమై యుండగలదు. ముసోలీగారి తీవ్ర ప్రతిజ్ఞలవలన పరిస్థితులు విషమించగలవు ఎవ్విధమైన రూపమును దాల్చునోగాని, వర్ణభేదముల నాధారముగ యీసంగ్రామము ప్రారంభమగునట్లు తోచుచున్నది. తెల్లవారు నల్లవారనే సమస్య తీవ్రమయినచో యీ నాగరక యుగమునందు ఫలము లాభదాయకముగాక భయంకరముగాగలదు. బలీయములగు దేశములు అధికారము హస్తములందిడుకొని స్వార్థమున కెట్టి ప్రచారముల నైనం గావింపగలవు. గావించుచున్నారు. అబిసీనియా విషయమున అబిసీయా పక్షపు విషయములు మనకు తెలియక మన సానుభూతిని క్రోడీకరింప జాలక పోవునటులే మన విషయమును నిజస్థితులు లోకమునకు కెరిగింపకపోయిన, మనయెడల సానుభూతి మెటుల గలుగగలదు? ప్రచారమే పరాధీన దేశములకు ముక్తిసాధనము.

---

## కొన్ని సలహాలు.

(నిర్మొగమాటి)

దక్షిణంసుకమిటీ మెంబరైన భట్టాభి ఒకమాటు తాలు కడపదాటించి ఆంధ్ర కుటుంబాన్నంతా పరామర్శించివస్తే ఏం?

*   *   *

నెల్లూరు కాంగ్రెసువారి ప్రతినిధిరాలు వ్యక్తిగతం గా కాక ప్రిన్సిపల్ మీద ఉంటే బాగుండును.

*   *   *

వెంకటగిరి దివానుగారు అధికారం ఏమాత్రం లేనందున రైతులవద్ద చెప్పినమాట దక్కించుకో లేక మాట తప్పివాడనే చెడ్డపేరు అనుభవించే దానికంటే క్వార్టరుపిటు పంచెరిస్తే బాగుగదా.

§   §   §

మునగాల రైతులను అష్టకష్టాలు పాలుచేసి ఆల్లాడింపజేదానికంటే జమీందారు, ఎం. ఏ. పరీక్షయి బుద్ధిమంతుడని పేర్వడ్డ పెద్ద కొడుక్కప్పగిస్తేఏం రాజ్యాన్ని!

§   §   §

ఇప్పటి వెంకటగిరి దివానుకంటే వేదాంతాచార్యులు వెయ్యిరెట్లు మేలంటారు పోలూరు తాలూకా వాసులు. పోనీ వేదాంతాచార్యులనో లేక పాతదివాన్ సుబ్బారావుగారినో రైతులు కోరితే తిరుగా రప్పిస్తే బాగు. కొంతమందైనా బాగుపడుతారు.

*   *   *

మాటనమ్మి వృధాగా జేశిరెడ్డి శేషారెడ్డిగారి మాదిరి మోసపోకుండా చిత్తూరుబోర్డును కోరినట్లు చీల్చించుకొని, మరొకరిద్దర్ని దేవాలయ కమిటీలో వేయించుకొని, పల్లిపు ప్రాసిక్యూట రుద్యోగాన్ని మరొకరు సంపాయించుకొని, శీతారామిరెడ్డిగారు పాతబాకీల కోరికి పోకుండేట్లు ఖరారు చేయించుకొని, రిసెటల్మెంటు పూని మాంగాడు కన్నైరాలమాదిరి అనుకూలపరిష్కారం చేయించుకొని, తర్వాత బొబ్బిలిదొర పాదాలు తిరుత్తనిపట్టాములో పెట్టిస్తే మంచిదని నా సిఫారసీ యూకోసీనియర్.

## మదరాసు శాసనసభ

మదరాసు శాసనసభ కాలపరిమితిని హెచ్చించుచు త్వరలో ప్రకటన కావింపబడు ననియూ, ఆగస్టునెల 8 తేది మదరాసు శాసనసభలో గవర్నరుగారు ఉపన్యసించెదరనియూ తెలియుచున్నది.

## చెంగల్పట్టు జల్లా జమీన్ రైతు సంఘము.

—∞—

ఈ నెల 8 తేది శ్రీయుత ఈశ్వరపాక చెంచురామారెడ్డిగా రధ్యక్షత క్రింద మహాసభ జరిగి, జమీన్ రైతు సంఘము స్థాపింపబడి అధ్యక్ష, కార్యనిర్వాహక వర్గముల యెన్నికలు జరిగినవి.

పైసంఘమునకు అధ్యక్షులు శ్రీ. నాగలాపురం వెంకటనరసింహులురెడ్డిగారు. కార్యదర్శులు శ్రీ. వేణుగోపాలరెడ్డిగారు, సుబ్రహ్మణ్యంరెడ్డిగారు.

నిర్వాహక సభ్యులు—శ్రీయుతులు ఈశ్వరపాక చెంచురామారెడ్డి, దేవారెడ్డి కుప్పారెడ్డి, పయ్యావుల మంగపతినాయుడు, కాకమాను వెంకటప్పనాయుడు, చెన్నావఝ్ఝల వెంకటకృష్ణయ్య, గుజ్జలపూడినాయుడు, గట్టుపనేని వీరాసామినాయుడు, నలమాని వీరప్పనాయుడు, వంగాయలపాటి లక్ష్మీపతినారయణ, పరమారు నరసింహులునాయుడు, గుజ్జలపూడి వెంకటసుబ్బానాయుడు, గట్టుపనేని చిన్నచెంగమనాయుడు, మాలపాటి కుప్పానాయుడుగార్లు.

## శ్రీ రమణభగవత్ప్రశంసా లేశము

(శ్రీయుత దుర్భా సుబ్రహ్మణ్యశర్మగారు, నెల్లూరు.)

మహానంబె పరమమగు వ్యా
ఖ్యానంబని మున్ను విజ్ఞులన వింటిని, నే
నీనాఁడు గంటిఁ దత్త్వ
జ్ఞానాకృతియగు మహర్షిసాన్నిధ్యమునన్

ఆ. ఉపనిషత్తులందు, విపులభాష్యములందు,
వృత్తులందు, సూత్ర వివృతులందు,
బహుముఖములనేది భాషింపఁబడు, నదే
వెలలు శ్రీమహర్షి వాక్కులందు.

మ. ధనవంతుఁడో దరిద్రుఁడో, జడుఁడో విద్యావంతుఁడో, దుష్టవ
ర్తనుఁడో శిష్టుఁడో, తన్వియో, పురుషుఁడో, ధాత్రీశుఁడో భృత్యుఁడో
మనుజుండైనను జాలు నెల్లరకు సమ్యక్ మార్గముఁ జూపుఁ బా
యని కూర్మిన్ రమణర్షి; వారికృప యాహా! యెంత నిర్వేలమో!

ఆ. ఘోరతపమొనర్చి గుహలలో గిరులలోఁ
బడసినట్టి యల్ల పరమవిద్య
'కాపిరైటు' చేసి కాపాడుకొనఁబోక
వెల్లడింతు వెంతవెఱ్ఱివయ్య!

క. నీపడినశ్రమము, మఱియున్
నీపాటించిన మహోగ్రనియతియు లేకే
యీపరమార్థం బడిగెడు
పాపల మముఁగాంచి వింతపడవె మహాత్మా?

మ. ఎలప్రాయంబున భోగభాగ్యములపై నిచ్ఛన్ విసర్జించి తి
ప్పల కాలన్ బలురప్పలన్ బహువిపత్ ప్రాప్తిన్ గనుంగొన్నయా
లలితాధ్యాత్మిక సత్యమున్ జనులకెల్లన్ బోధగావించె దీ
నల బుద్ధుండవో, గాక శంకరుఁడవో యయ్యా, మహర్ష్యగ్రణీ!

సీ. శీతలఁగన్నొత్తఁగి యిల్వెడల నీ కొల్పిన
దీక్షాపాన్వితబుద్ధియే నటయ్య?
కంటక శిలల లోఁగక చరించిన యవి
యీపాదకమలంబులే నటయ్య?
కటునిష్ఠురతపోగ్నిఁ గ్రాఁగివేగిన యది
యీచారు తనువల్లియే నటయ్య?
ప్రశమనిష్ఠ నిరంతరము నూఁతవడినవి
యీకన్నుఁ దామరలే నటయ్య?

తే. ఎన్నికష్టంబు లెన్నివిపన్నికరము
లెన్ని ప్రత్యూహములు నీవి నెల్లదాఁటి
కన్న 'సద్విద్య' వెదచల్లుచున్నవాఁడ
వెంతటి యుదారుఁడవో బ్రహ్మఋషివరేణ్య!

సీ. అమృతంబు తొలఁకు వాక్యములు నీనోటవిన్న
వారికి నిగమాంత పఠన మేల?
తేజోమయము యుష్మదీయాకృతిని గన్న
వారికి సుగుణభావనము లేల?
శాంతిదంబైన మీచక్కి దక్కిన వారి
కిఁక బ్రహ్మలోక వాసేచ్ఛ యేల?
నిర్వాసనంబైన నీమహాసగతి గన్న
వారికి నిర్గుణోపాస్తి యేల?

తే. కర్మభక్తులు జ్ఞానయోగములు గలసి
యొగమునుగొన్న యొకవింత వ్యక్తివీవు
మన్న మే మెఱుఁగనియట్టి మందమతుల
మేఁ గొలుంగుదు మయ్య నిన్నీశ్వరుండ!

*   *   *

తే. యువ శరజ్జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి సి
తాంక వాసరమున, రమణాశ్రమమున
వ్రాసె, దుర్భాన్వయుఁడు, భగవత్పదాబ్జ
సవిధమునన 'సుబ్రహ్మణ్యశర్మ' మీని.

## మళ్లీ కంట్రాక్టు నాటకమా?

మొన్నటికంట్రాక్టుదారులే మోసపోకండి

లవకుశ నాటకానికిపోయి పడినఅవస్థ మరచిపోకముందే, శ్రీ బెజవాడ దుర్గాఅమెచూర్సువారు 14 [illegible] దిరాన "రంగూన్ రౌడి" [illegible] పాత్రిప్రైయిటర్లుపేరు ఎవరిమున్న తెరమరుగున పెత్తనంచేసేది మొన్నటి లవకుశ నాటకం కంట్రాక్టుపొందుహులేనట. నాటకానికి యేఅక్టరు రాకపోయినా రెట్టింపుసొమ్ము వాపసట. ఔను, నాటకం మొదలెట్టే దానికిముందే ఠాక్టి కోవకుండా కలెక్షను మూటెత్తుకొని పరారయ్యే వాండ్లు, రెట్టింపు యిస్తామనడానికేమి? పాతుల కంటే పోలీసువారు, మునిసిపాలిటీవారు జాగ్రత్తపడితే మంచిది.

—ఒకరు.

## ఎస్టేట్సు లాన్యాడు ఆక్టు

1934-వ సంవత్సరపు అన్ని సవరణలున్నూ, ఇనాముల బిల్లున్నూ, తీర్పు, అన్నివివరణములున్నూ, యీ ఆక్టు క్రింది వ్యవహారములకు లిమిటేషన్‌కాలు తెలియఁగల షెడ్యూల్లు తోటిన్నీ తెలుగున వ్రాయబడి చక్కని బైండు చేయబడినది.

అర్డరుతో సొమ్ముపంపువారికి పోస్టేజి సహా రు. 1—6—0 లు *V. P.* గా పంపగోరువారు రు 0-8-0 లు పోస్టు చీట్ల అడ్వాన్సు పంపవలెను.

మేనేజరు:—

తెలుగు లా జర్నలు ఆఫీసు,
నెల్లూరు.




డాంగ్రే గారి
బాలామృతము
బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, బలమున్ను, ఆరోగ్యము, నిచ్చును.
అన్నిస్థలములందు దొరకును.

ప్రొప్రయిటరు:—
కె. టి. డాంగర్ అండ్ కో.,
గిరగాం-బొంబె.

# కలువాయి డాక్టరు

## ప్రజల ఘోష.

I

1934 జూలైలో కొరివాయి గ్రామమునుంచి ఒక మనిషి మూత్రం దిగకపోవడంచేత కలువాయి ఆసుపత్రికి తీసుకొనివచ్చినారు. అప్పటికి షుమారు 8 గంటలు ఆయియుండును. అప్పుడు అతనిభార్య డాక్టరుగారి కాళ్లమీదపడి ఎంతో చెప్పుకొన్నది. యెంత చెప్పుకొన్నను కక్షీ చేయలేదు. బాధ అధికమగుచున్నది. అప్పుడు తిరుగా డాక్టరు కాళ్లమీద పడి యెంతెంతో ప్రాధేయపడినదిగాని కక్షీ చేయలేదు. యేదోమందు యిచ్చినాడట. సదరు జబ్బుమనిషి ఆసుపత్రి వరండాలోనే యున్నాడు. డాక్టరువారు కంటితోనైనా చూచినవారుకారు. అప్పుడు సాయంత్రము కావస్తున్నదగంటకు సదరు రోగిని ఆసుపత్రిలో వుండకూడదు అని మెడబట్టి త్రోయించినారు. సదరు జబ్బుమనిషికి బాధ అధికమై కడుపు వుబ్బి షుమారు 7-8 గంటలకు కలువాయి పోర్డుచావిడి మీద చనిపోయినాడు. యీ విషయమును గురించి జిల్లాడాక్టరు గారికి మహజరు కూడా పెట్టియున్నారు. శ్రీ జిల్లా డాక్టరువారు 1934 సంవత్సరము నవంబరు నెలలో విచారించినారు. సదరు విచారణరోజు కలువాయి పురవాసులు కలువాయి డాక్టరుగారి చేతగాని తనమును జిల్లా డాక్టరుగారితో చెప్పుకొనుటకు షుమారు 300 మంది కలువాయి రెస్టుహౌసువద్దకు పోయినారు. ఆరోజు మూడుగంటలనుంచి రాత్రి ఎనిమిదిగంటలవరకు కొంతమందిని విచారించినారు. చచ్చిపోయిన అతని భార్యనుకూడా విచారించినారు. శ్రీ జిల్లాడాక్టరువారు యింక విచారించవలసిన అవసరము లేదు, చాలును అని చెప్పినారు. ప్రజలు అంతా యింటికిపోయినారు. యీ విషయమును గురించి జిల్లాబోర్డువారికి మహజరు పంపియున్నారు. ఈ కార్యము మహాఘోరము.

నాగిరెడ్డి వెంగ రెడ్డి.

II

తే 7-7-35 వుదయము 8 గంటలకు వెంగళాయపల్లె కాపురస్థులు కొత్తూరు రామిరెడ్డిగారు తన మేనకోడలు కోటమ్మకు నవమాసములుగా వుండి నెప్పులు కనుపించినందున ఆమెను సదరు రామిరెడ్డిగారు కలువాయి ఆసుపత్రికి తీసుకొనివచ్చినారు. వచ్చిన 1 గంటకు ప్రసవము అయ్యేలాగున వుండినది. డాక్టరుగారితో యింటికిపోయి రామిరెడ్డిగారు చెప్పినారు. డాక్టరుయిప్పుడు నేను రాను, 2 గంటలకు అయితే వస్తాను అని చెప్పినారు. అవసరముగా యున్నది కాబట్టి యీ గ్రామములోవుండే నాటు మంత్రసానివల్ల కాన్పుచేయించినారు. చూడండడి, యెంత అన్యాయమో. 10 మైళ్ల దూరమునుంచి వచ్చిన వాండ్లను యేమి చేసినాడో.

కలువాయి పురవాసి.

III

ఒకసారి మాజిస్ట్రేటుకు రావుసాహెబ్ ఎ. ఎ. అబ్బయ్యనాయుడుగారు కలువాయి రెస్టుహౌసులో క్యాంపుచేసియున్నారు. ఆరాత్రి కలువాయి గ్రామకాపురస్థుడైన గొల్లకులం బీద బత్తల కోటయ్యకు మూత్రము దిగకపోయినందున షుమారు సాయంత్రం 8 ఘంటలకు కలువాయి ఆసుపత్రికి తీసుకొని పోయినారు. అతీవగొల్లకు యెంతో ప్రార్థించినను కక్షీ చేయలేదు. బాధ అధికమైపోయినది. అప్పుడు కలువాయిలో కొంతమంది పెద్దలు ఒకమోటారు తీసుకొనివచ్చి పాదలకూరికి తీసుకొనిపోయినారు. అక్కడ కక్షీచేసి మూత్రముదీసి బ్రతికించినారు. సదరు డాక్టరుగారు ఆ గొల్లకోటయ్యను పొదలకూరులోనే యుంచుకొని బాగుచేసి ఆనాటిరాత్రి గుర్నాథరావుగారి వద్దనే చెప్పియుండిన గొల్లకోటయ్య విషయము యెట్లుండియుండునో. యీవిషయమును గురించి శ్రీ॥ నాయుడుగారికి తెలియును. యీ విషయమును మహాశయులు ఆలోచించవలసినదిగా కోరుచున్నాము.

మరిఒకమాట. కలువాయి డాక్టరుగారిని పొదలకూరికి మారుస్తారు అని వాడుకచేత పొదలకూరి పురవాసులు వాదలిపోవుచున్నారు. యీ బీదజనులు కష్టములు యెప్పుడు తొలగునో అని జిల్లాబోర్డువారిని ప్రార్థించుచున్నాము.

షేక్. రసూల్ సాహెబు.

శ్రీపాల్లు పెంచలసుబ్బయ్య.

---

## లకోటా ప్రశ్నలు

ప్రత్యక్ష నిదర్శనం.

మీ సీల్డ్ కవరులోని అయిదు ప్రశ్నలకు ఫలితములు కేలీ మహిమచే వ్రాసి సీల్డుకవరు సహా పంపుటకు రు 1—5—0. సం॥ ఫలితం నెలలవారీ రు 1—8—0.

శ్రీ సర్వతీ జోతిషాలయం.

నేమాని సోమేశ్వరశర్మ దేవాలయంవీధి,

కాకినాడ.

---

## పూడిపర్తి

## వ్యవసాయ కూలీల సమ్మె.

నెల్లూరు జిల్లా కాంగ్రెసు సంఘమువారు తే 25-6-35 దిన జరిగిన సమావేశములో రు 25 లు సమ్మెదారుల సహాయముకై యిచ్చుటకు తీర్మానించిరి. అఖిల భారత కాంగ్రెసు సంఘ సభ్యులును, నెల్లూరు జిల్లా గొప్ప రైతు నగు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు సమ్మెదారులకు రు 5 లు యిచ్చుటవల్లనే సమ్మె చాలా న్యాయమైనదని ఏర్పడుచున్నది. ప్రస్తుత జిల్లాకాంగ్రెసు ప్రెసిడెంటుగారగు శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు రు 10 లును, యువజన సంఘమువారు కొంత ధనమును యిచ్చి తమ సానుభూతినిజూపిరి. కార్మికుల శ్రేయస్సు కాబట్టి జిల్లా ప్రజలందరును విరివిగా సహాయపడగోరుచున్నాము.

గండవరపు హనుమారెడ్డి,

ప్రధాన కార్యదర్శి.

నెల్లూరు జిల్లా కాంగ్రెసు.

---

## జైలు బడ్జెటు తగ్గించుకోడానికి ఖైదీలను వదలుట.

సంయుక్తరాష్ట్ర ప్రభుత్వమువారు 1935-36 సం॥నకు జైలు బడ్జెటునందు రు 30,000 లను తగ్గింపదలచి ఖైదీలను కొందరిని జూలై 15 తేదీనాడు వదలివేసెదరట.

* * *

పసిఫిక్కు మహాసముద్రములో జపానుకు సమీపమున 153 యుద్ధనావలును, 466 విమానములును సంచారము చేయుచున్నవి

---


తేది ఎదురుచూడుడు !! తేది ఎదురుచూడుడు !!

జూలైనెలలో తప్పక ప్రదర్శింపబడును

# ది న్యూటాకీ పిక్చర్ పాలస్, నెల్లూరు.

ముదులోలుకు క్రొత్త హాలులో

కలకత్తా అరోరా ఫిలిం కార్పొరేషన్ వారిచే తయారుచేయబడిన

తెనుగులో మాట్లాడే గొప్ప ఫిలిం

## సతీ అనసూయ

త్వరలో ప్రదర్శింపబడును.

కథకు శోభ తెచ్చిన నటులు!!

తుంగల చలపతిరావు

యస్. పి. లక్ష్మణస్వామి.

యం. గోపాలరావు.

యన్. కృష్ణమాచారి.

మిస్. డి. కోటిరత్నం

డి. లీలాకుమారి.

డి. వెంకుబాయి.

రంగపుష్ప చిత్ర

మొదలగు పేరుపొందిన నటకులు ఇందు పాల్గొనియున్నారు.

మృదుమధురమగు పాటలు ! కోకిల గానమును ధిక్కరించు గానము !



నేత్ర పర్వమొనర్చు చక్కని దృశ్యములు !

హాయిగొల్పుపాటలు ! అమృతబిందువులవంటి మాటలు !

టి. బాబురావు,

మేనేజరు.

యస్. అహమ్మద్ ఖాన్,

ప్రొప్రయిటరు.


Printer, Publisher, and Editor – N. Venkatrama Naidu – Zamin Ryot Press, Gandhi Chowk, Nellore.